నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, ఆదివారం 14 ఏప్రిల్ 2024 | SANGAREDDY

రాములోరి కల్యాణానికి కేసీఆర్‌కు ఆహ్వానం

కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న చింతమడక గ్రామస్తులు

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 13: సిద్దిపేట రూరల్ మండలంలోని చింతమడకలో ఈనెల 17న శ్రీరామ నవమి సందర్భంగా నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను చింతమడక గ్రామపెద్దలు శనివారం కోరారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కల్వకుంట్ల వంశీధర్‌రావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో రామాగౌడ్, మాజీ సర్పంచ్ హంసకేతన్‌రెడ్డి, మల్లుపల్లి పోశయ్య, సత్యనారాయణ గౌడ్, శేఖర్ తదితరులు ఉన్నారు.

భారీ వర్షం...

పొంగిన వాగులు

సిర్గాపూర్: కిషన్ నాయక్ తండా నల్లవాగు ప్రాజెక్టులోకి ప్రవహిస్తున్న వరద

సిర్గాపూర్, ఏప్రిల్ 13: మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు పొంగిపొర్లాయి. మండలానికి ఎగువ ప్రాంతమైన కంగ్టి మండలం, పక్కనే ఉన్న కర్ణాటక పరిసరాల్లో శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం భారీ వర్షం కురవడంతో నల్లవాగు పెద్దఎత్తున ప్రవహించింది. దిగువన నల్లవాగు జలాశయంలోకి జలాలు చేరుతున్నాయి. అయితే ఈ వాగు పరిసర ప్రాంతాల్లో వేసిన పంటలు గాలివాన బీభత్సానికి నెలకొరిగి కొంతమేర నష్టం జరిగిందని రైతులు తెలిపారు. వర్షంతో వేడి నుంచి ఉపశమనం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు.


దౌల్తాబాద్ బీఆర్ఎస్ సభలో గజమాలతో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిని, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని సత్కరిస్తున్న హరీశ్‌రావు, నాయకులు

కాంగ్రెస్, బీజేపీ తోడుదొంగలు

- బీఆర్ఎస్ పదేండ్ల అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు
- ఆరు గ్యారెంటీల అమలులో పూర్తిగా విఫలం
- ప్రశ్నించే గొంతు వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- ప్రజలు మోసపోవద్దు... గోసపడుతాం
- దౌల్తాబాద్ యువభేరి సభలో మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

రాయపోల్, ఏప్రిల్ 13: ప్రజలను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి వైఫల్యం చెందాయని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లను చిత్తుగా ఓడించాలని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో జరిగిన నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ యువత సమావేశంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిలతో కలిసి హరీశ్‌రావు మాట్లాడుతూ త్యాగాల పునాదుల మీద తెలంగాణ సాధించుకున్నామన్నారు. దేశంలో పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలకు చేసిందేమీలేదన్నారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయన్నారు. నల్లధనం తెచ్చి పేదల ఖాతాల్లో వేస్తామని మోసం చేశారన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారన్నారు. ఉప ఎన్నికల్లో గెలిచిన రఘునందన్‌రావు హామీలు నెరవేర్చకుండానే మళ్లీ ఓట్ల కోసం గ్రామాల్లో తిరగడం సిగ్గుచేటన్నారు. ఆయన మోసపూరిత హామీలను దుబ్బాక ప్రజలు తెలుసుకోవాలని హరీశ్‌రావు యువతకు సూచించారు. 6 గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను ఎప్పుడు అమలు చేస్తుందని ప్రశ్నించారు. కార్యక్రమానికి వచ్చేటప్పుడు మిరుదొడ్డి మండలంలో మహిళా రైతులతో మాట్లాడానని, వడ్లు ఎవరూ కొనడంలేదని వాపోయారన్నారు. మహాలక్ష్మి పథకంతో మహిళలకు రూ. 2500, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా మోసం చేశారని హరీశ్‌రావు చెప్పారు. జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన వెంకట్రామిరెడ్డి మీకు సుపరిచితుడని, ఈ ప్రాంత అభివృద్ధిలో ఆయన ఎంతో కీలక పాత్ర పోషించారన్నారు. గతంలో దుబ్బాకలో అనాథలు రాధా, రాధికలకు అండగా ఉండి విద్యాబుద్ధులు చెప్పించి, పెండ్లి కూడా చేసిన మనసున్న వ్యక్తి వెంకట్రామిరెడ్డి అన్నారు. ట్రస్టు ద్వారా సేవ చేయడానికి ముందుకొస్తున్న ఆయనను ప్రజలు ఆశీర్వదించి కారు గుర్తుకు ఓట్లు వేసి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో సతీష్‌రెడ్డి, మనోహర్‌రావు, రాజమౌళి, భాస్కరాచారి, కత్తి కార్తీక, సురేశ్‌గౌడ్, శేఖర్‌గౌడ్, మహేశ్‌రెడ్డి, ఖలీల్‌లోద్దీన్, రాజేందర్, రహీమొద్దీన్, జ్యోతిశ్రీనివాస్‌గౌడ్, యాదగిరి, వెంకటేశ్వర శర్మ, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

ఉద్యమాల గడ్డ దుబ్బాక
- కొత్త ప్రభాకర్‌రెడ్డి

ఉద్యమాల గడ్డ దుబ్బాకలో ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి భారీ మెజార్టీ అందిద్దామని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దుబ్బాక మొదటి నుంచి ఉద్యమ నాయకులు కేసీఆర్, హరీశ్‌రావు అడుగుల్లో అడుగై ముందుకు సాగిందన్నారు. మెదక్ పార్లమెంట్ ఎన్నికలు మనకు అత్యంత ప్రతిష్టాత్మకమన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థికి ఆదరణ కరువైందని, బీజేపీ అభ్యర్థికి ఆ పార్టీవారే ఓట్లు వేసే పరిస్థితి లేదన్నారు. అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. బీఆర్ఎస్ నాయకులు గ్రామాల్లోని యువతకు ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు.

ఎడ్లు, బండ్లు ఇస్తామని మోసం చేశారు: వెంకట్రామిరెడ్డి

గత ఎన్నికల్లో ఎడ్లు, బండ్లు, నిరుద్యోగ భృతి ఇస్తామని యువతకు బీజేపీ అభ్యర్థి మోసం చేశారని, వారికి యువత ఓటుతో గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. గెలిచిన నెల రోజుల్లో రూ.100కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి పేదలకు అండగా ఉంటామన్నారు. ప్రతి నియోజకవర్గంలో రెండు ఫంక్షన్ హాళ్లు సొంత డబ్బుతో నిర్మించి పేదలకు అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డితో కలిసి అభివృద్ధికి జోడెడ్లలా గజ్వేల్ తరహాలో దుబ్బాకను అభివృద్ధి చేస్తామన్నారు. రెండుసార్లు ఎంపీగా, ఎమ్మెల్యేగా ప్రభాకర్‌రెడ్డికి ఘన విజయం అందించిన దుబ్బాక ఓటర్లు తనకు సైతం ఆశీస్సులు అందించాలని కోరారు.


దౌల్తాబాద్ సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు

కాంగ్రెస్ పాలనలో ప్రజలకు అవస్థలు

- సాగునీళ్లు ఉండవు..కరెంటు ఉండదు
- బీజేపీతో కాంగ్రెస్ లోపాయికారి ఒప్పందం
- పోటీలో డమ్మీ అభ్యర్థులను నిలబెట్టిన కాంగ్రెస్
- ఓటుతో రెండు పార్టీలనూ చిత్తుగా ఓడించాలి
- మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సంగారెడ్డిలో విద్యార్థి, సోషల్ మీడియా, యువతతో ఆత్మీయ సమ్మేళనం


సంగారెడ్డి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, పక్కన మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

సంగారెడ్డి, ఏప్రిల్ 13: పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని గెలిపించేందుకు రాష్ట్రంలో కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులను నిలబెట్టిందని, బడే బాయ్ తనపై జర నజర్ పెట్టు అని చోటే బాయ్ మాటలు బట్టీ తెలుస్తుందని మాజీ మంత్రి హరీశ్‌రావు చురకలంటించారు. శనివారం సంగారెడ్డి నియోజకవర్గ విద్యార్థి, సోషల్ మీడియా, యువతతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమ్మేళనాన్ని టీఆర్ఎస్వీ నియోజకవర్గ చైర్మన్ శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ బీజేపీతో కాంగ్రెస్ పార్టీ లోపాయికారి ఒప్పందం చేసుకుని అభ్యర్థులను బరిలో నిలిపిందని, బీజేపీ బలమైన అభ్యర్థులకు గులాం గిరి చేసే ప్రక్రియలో భాగంగానే ఈ ఒప్పందం చేసుకుందని ఎద్దేవా చేశారు. నాలుగు నెలల క్రితం వరకు రాష్ట్రంలో సాగు, తాగు నీళ్లకు ఇబ్బందులు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇబ్బందులు మొదలయ్యాయన్నారు. నాలుగేండ్ల పాటు ప్రజలు అవస్థలు పడక తప్పదన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో రెండు పార్టీల అభ్యర్థులను చిత్తుగా ఓడించి తెలంగాణ పౌరుషాన్ని చూపించాలని పిలుపునిచ్చారు. రంజాన్ పండుగకు తోఫాలు పంపిణీ చేయలేని పరిస్థితి రావడం సిగ్గుచేటన్నారు. గతంలో అన్ని వర్గాల ప్రజల పండుగలకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుందని, కాంగ్రెస్ హయాంలో ఎందుకీ పరిస్థితి వచ్చిందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే చట్టసభల్లో ప్రశ్నించే గొంతుకలవుతామని, నాలుగు నెలల్లో ఆగం పట్టించి ప్రజలను మభ్య పెట్టడంలో కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ అధికారిగా పనిచేసిన అనుభవంతో ప్రజాసేవ చేసేందుకు బీఆర్ఎస్ తరపున అభ్యర్థిగా నిలబెట్టామని, ప్రజలు ఆశీర్వదించి పార్లమెంటుకు పంపించాలని కోరారు. రూ.100కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించేందుకు ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి ప్రజల ఆకాంక్షలను నిలబెట్టుకోవాలని హరీశ్‌రావు యువతకు పిలుపునిచ్చారు. ఆత్మీయ సమ్మేళనంలో జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, నరహరిరెడ్డి, బుచ్చిరెడ్డి, వరలక్ష్మి, మనోహర్ గౌడ్, రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, పాండురంగం, యువత విభాగం, విద్యార్థి, సోషల్ మీడియా ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మాయమాటలకు మోసపోవద్దు: ఎమ్మెల్యే చింతా

మాయమాటలు చెప్పి ఓట్లు దండుకునే కాంగ్రెస్, బీజేపీల మోసపూరిత వాగ్దానాలకు మోసపోవద్దని, లోకసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థికి భారీ మెజార్టీ ఇవ్వాలని యువతను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కోరారు. విద్యావంతుడిగా, మాజీ కలెక్టర్‌గా మనకు సుపరిచితుడైన అభ్యర్థిని గెలిపిస్తేనే తెలంగాణకు మేలు జరుగుతుందన్నారు. దేవుడిపై రాజకీయాలు చేస్తున్న బీజేపీకి బుద్ధిచెప్పాలని, అబద్ధాలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని కోరారు.

సేవకుడిగా పనిచేస్తా: వెంకట్రామిరెడ్డి

మాటిస్తే ప్రాణమిస్తానని, ప్రజలు ఆశీర్వదిస్తే సేవకుడిగా పనిచేస్తానని ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. ఈ ప్రాంత సమస్యల పరిష్కారానికి పార్లమెంటులో గళం విప్పి నిధులు తీసుకొచ్చి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో రూ.100కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతీయువకులకు అండగా నిలుస్తానన్నారు.

సంగారెడ్డి సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు

హామీలు తప్పిన కాంగ్రెసోళ్లను నిలదీయాలి

- హామీల సొమ్ము వస్తే కాంగ్రెస్‌కు... రాకుంటే బీఆర్ఎస్‌కే ఓటేయండి
- కాంగ్రెస్, బీజేపీలూ బీఆర్ఎస్ లేకుండా చేద్దామనుకుంటున్నాయి..
- ప్రజలు వాస్తవాలు గ్రహించి కారుగుర్తుకు ఓటేయాలి
- వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- బీజేపీ అభ్యర్థి చెల్లని రూపాయి.. కాంగ్రెస్ అభ్యర్థి డమ్మి
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- పటాన్‌చెరులో బీఆర్ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశం

పటాన్‌చెరు సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, పక్కన మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

పటాన్‌చెరు, ఏప్రిల్ 13: ఇచ్చిన హామీలు మర్చిన కాంగ్రెస్ ప్రచారానికి వస్తే చీపుర్లతో మహిళలు నిలదీయాలని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. శనివారం పటాన్‌చెరులోని జీఎమ్మార్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో హరీశ్‌రావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌రెడ్డిలతో పాటు ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు చెప్పి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. 6 గ్యారెంటీల్లో ఏ గ్యారెంటీ సరిగ్గా అమలుకావడం లేదన్నారు. నమ్మితే నట్టేట ముంచిన పార్టీలు కాంగ్రెస్, బీజేపీలన్నారు. రూ.4వేల పింఛన్ అందిస్తామని 44 లక్షల మందిని మోసం చేశారని మండిపడ్డారు. రైతు భరోసాతో రూ.15వేల రైతులకు, రూ.12వేలు కౌలు రైతులకు ఇస్తామని చెప్పి నాలుగు నెలలైనా ఉలుకుపలుకూ లేదన్నారు. రేవంత్‌రెడ్డి అబద్ధాల కోరని, నమ్మి కాంగ్రెస్‌కు ఓటేస్తే మొసపోతారని హెచ్చరించారు. దుబ్బాకలో చెల్లని రూపాయి పటాన్‌చెరులో చెల్లుతుందా అన్నారు. రఘునందన్‌రావు అబద్ధాలు చెప్పి అప్పుడు గెలిచినా ఇప్పుడు సాధ్యం కాదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి డమ్మి అభ్యర్థి అని తెలిపారు. వెంకట్రామిరెడ్డి చదువుకున్న ఐఏఎస్ అధికారి అన్నారు. ప్రజల కోసం సేవచేసేందుకు రాజకీయాల్లో చేరారని, ఆయన్ని గెలిపించుకుంటే పార్లమెంటులో మనవాణిని వినిపిస్తారన్నారు. గత ఎన్నికల్లో చేసిన పొరపాట్లను సమీక్షించి లక్ష మెజార్టీని పటాన్‌చెరులో బీఆర్ఎస్ సాధిస్తుందన్నారు. ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ఎంపీగా గెలిపిస్తే అద్భుతమైన ప్రగతిని చూపిస్తానన్నారు.పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో వెంకట్రామిరెడ్డికి లక్ష మెజార్టీ ఇస్తామన్నారు. గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్లు సరిచేసుకుని కారుగుర్తును భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, సఫాన్‌దేవ్, శంకర్‌యాదవ్, కార్పొరేటర్లు మెట్టు కుమార్‌యాదవ్, పుష్పాసగేశ్ యాదవ్, ఆదర్శ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు కొలన్ రోజాబాల్‌రెడ్డి, తుమ్మల పాండురంగారెడ్డి, లలితాసోమిరెడ్డి, ఎంపీపీలు సుష్మశ్రీవేణుగోపాల్‌రెడ్డి, ఈర్ల దేవానంద్, జడ్పీటీసీలు సుధాకర్‌రెడ్డి, కుమార్ గౌడ్, సుప్రజావెంకట్‌రెడ్డి, రాములు గౌడ్, గాయత్రీపాండు, అష్టల్, నగేశ్ యాదవ్, మెరాజ్‌ఖాన్, గోల్కొండ లక్ష్మణ్, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పటాన్‌చెరు సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు

అయ్యో..అన్నదాతలు

ఎండుతున్న పంటలు.. బలవన్మరణానికి పాల్పడుతున్న రైతులు

- బాకీలు ఎలా తీర్చాలని ఆందోళన
- ఇద్దరు రైతుల ఆత్మహత్య
- రోడ్డున పడ్డ రెండు కుటుంబాలు

కొండపాక(కుకునూరుపల్లి)/ శివ్వంపేట, ఏప్రిల్ 13: ఉమ్మడి మెదక్ జిల్లాలో రైతులు పిట్టల్లా రాలిపోతున్నారు. పంటలు ఎండిపోవడం, అప్పులు కావడం, ప్రభుత్వం నుంచి చేయూత లేకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుని తనువు చాలిస్తున్నారు. కుటుంబాల్లో పుట్టెడు దు:ఖాన్ని మిగిలిస్తున్నారు. మెదక్, సిద్దిపేట జిల్లాల్లో శనివారం ఇద్దరు రైతులు ఆత్మహత్యకు యత్నించి ప్రాణాలు తీసుకున్నారు.

కుకునూరుపల్లిలో అప్పుల బాధతో యువరైతు...

పంట ఎండిపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆందోళనకు గురై సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లిలో పురుగుల మందు తాగి యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. కుకునూరుపల్లికి చెందిన పాల పరమేశ్‌గౌడ్ (32)బ్యాంకులో ఇంటిలోన్ తీసుకోవడంతో పాటు తెలిసిన వారి వద్ద అప్పులు తెచ్చి ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పరమేశ్ రెండు నెలలుగా మహిళా సంఘం లోన్ సైతం కట్టలేదు. తన వ్యవసాయ భూమితో పాటు తన తమ్ముని వ్యవసాయ భూమిలో వరిపంట సాగుచేశాడు. పంట చేతికివస్తే అప్పులు తీరుతాయనుకున్నాడు. ఎన్నో ఆశలతో పంట వేసిన పరమేశ్ ఎండిపోవడంతో నష్టాల బారిన పడ్డాడు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు పరమేశ్‌కు బ్యాంకు అధికారులు పెండింగ్‌లో ఉన్న ఇంటిలోన్ కట్టాలని ఒత్తిడి తెచ్చారు. దీంతో ఏప్రిల్ 7నే పొలం వద్దకు వెళ్లి వరి పంటను చూస్తూ కన్నీళ్లు పెట్టుకున్నాడు. చావు తప్ప మరో మార్గం లేదని పురుగుల మందు తాగాడు. ఇంటివద్ద ఉన్న భార్య, పిల్లలను గుర్తుకు తెచ్చుకుని చివరిసారిగా చూద్దామని ఇంటికి చేరుకున్న పరమేశ్ వాంతులు చేసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో ఏం జరిగిందో తెలియని కుటుంబసభ్యులు పరమేశ్‌ను వెంటనే గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరమేశ్‌ను పరిశీలించిన వైద్యులు అతడు పురుగుల మందు తాగినట్లు గుర్తించడంతో పాటు అతని పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన వైద్యం కోసం పెద్ద దవాఖానకు తరలించాలని సూచించారు. వైద్యుల సూచన మేరకు ములుగులోని ఆర్‌వీఎం దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి తల్లి, భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గతేడాది నవోదయ పరీక్ష రాసిన పెద్ద కూతురు రక్షిత వర్గల్‌లోని నవోదయ పాఠశాలలో చదువుతున్నది. చిన్న కూతురు రిషిత గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నది. పరమేశ్ మృతితో ఆయన కుటుంబం రోడ్డున పడింది. బాధిత రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. మృతుడి భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కుకునూరుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పరమేశ్‌గౌడ్ (ఫైల్)

పంట ఎండింది.. కౌలురైతు ప్రాణం పోయింది..

కౌలుకు తీసుకున్న ఆరెకరాల పొలం ఎండిపోవడంతో కుంగిపోయి పురుగుల మందు తాగి మహిళా రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన తలారి బాలమణి (43) తన భర్తతో కలిసి తనకున్న రెండు ఎకరాల పొలంతో పాటు అదనంగా మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగుచేశారు. ఈసారి యాసంగిలో కౌలుకు తీసుకున్న ఆరు ఎకరాల పొలంలోని రెండు బోర్లలో భూగర్భ జలాలు అడుగంటడంతో పంట ఎండిపోయింది. దీంతో ఈనెల 8న పురుగుల మందు తాగింది. ఆమెను కుమారుడు వెంటనే ములుగులోకి ఆర్‌వీఎం దవాఖానకు తీసుకెళ్లాడు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి 12వ తేదీ మధ్యాహ్నం మృతిచెందింది. మృతురాలి కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపారు.

తలారి బాలమణి (ఫైల్)

పోలీసుల దాడులు

- సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 24 బృందాలుగా తనిఖీలు
- 38 మందిపై కేసు నమోదు
- రూ.1.21 కోట్ల నగదు, 13 కేజీల వెండి, 70 తులాల బంగారం సీజ్
- అక్రమ వడ్డీ వ్యాపారం చేస్తే కఠిన చర్యలు: సీపీ అనురాధ

దుబ్బాకలో పల్లె కృష్ణగౌడ్ ఇంట్లో ప్రామిసరీ నోట్లు, రికార్డులు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 13: సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా అక్రమ వడ్డీ వ్యాపారం, ఫైనాన్స్ నిర్వహిస్తున్న వారిపై శనివారం పోలీసులు 24 టీమ్‌లుగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు అక్రమ వడ్డీ వ్యాపారం, ఫైనాన్స్ నిర్వహిస్తున్న 38 మందిపై కేసు నమోదు చేయడంతో పాటు రూ. 1,21,27,120 నగదు, 490 డాక్యుమెంట్లు, 13 కేజీల వెండి, 70 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా సీపీ అనురాధ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా ఫైనాన్స్ నిర్వహించి, అధిక వడ్డీలతో సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని వడ్డీలకు డబ్బులు ఇచ్చి వారి నుంచి అధిక వడ్డీ వసూలు చేసే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతితో చట్టపరమైన పద్ధతుల్లో ఫైనాన్స్ నిర్వహించే వారిని మాత్రమే నమ్మాలన్నారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకపోయినా, అక్రమంగా ఫైనాన్స్ వ్యాపారం నడిపేవారి వివరాలు సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ సెల్: 8712667100 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అప్పు తీసుకోవడం, ఇవ్వడం నేరం కాదని, కానీ ఆర్‌బీఐ నిబంధనలు, తెలంగాణ మనీ లెండింగ్ చట్టంలోని నిబంధనల ప్రకారం చట్టబద్ధంగా ఎవరైనా లైసెన్స్‌తో అప్పులు ఇవ్వవచ్చని, తీసుకోవచ్చని సీపీ అనురాధ తెలిపారు.

సిద్దిపేటలోని వడ్డీ వ్యాపారి ఇంట్లో తనిఖీ చేస్తున్న పోలీసులు